కల్యాణోత్సవం సందర్భంగా తాళిబొట్టు చూపుతున్న వేదపండితుడు

కమనీయం.. రేణుకాఎల్లమ్మ కల్యాణం

నల్లగొండ సిటీ, జూన్ 6 : కోరిన కోర్కెలు తీర్చే శ్రీరేణుకాఎల్లమ్మ జమదగ్ని మహర్షిల 23 వ వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వేద పండితులు ఘనంగా నిర్వహించారు. రేణుకాఎల్లమ్మ అమ్మవారు, జమదగ్ని మహాముని ఉత్సవ విగ్రహాలు పల్లకిలో ఉంచి, కోలాట బృందాలు, డప్పుచప్పుళ్ల మధ్య కళ్యాణ మండపానికి తీసుకువచ్చారు. అంతకు ముందు అమ్మవారికి ఎదుర్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ మహోత్సవానికి చుట్టు పక్క గ్రామాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శుక్రవారం ఉదయం సుప్రభాతసేవ, లలితాసహస్ర నామార్చన, బాలభోగ నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ చంద్రంగౌడ్, నాగేశ్వర్ రావు, ఉపేందర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

పూజా కార్యక్రమంలో పాల్గొన్న కంచర్ల సోదరులు

ఉరుమడ్లలో రెండో రోజు మండప పూజ

చిట్యాల, జూన్ 6: మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న మహాహా కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండవ రోజు పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మండప పూజ, వేద పారాయణం, మూల మంత్ర జప హోమం, ప్రదోశ పూజ, సహస్ర కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి దంపతులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

వేములపల్లి, జూన్ 6: మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన పజ్జూరి రవికి రూ.33వేలు, శీలం గోపికి రూ.28,500, పురాణపు పిచ్చమ్మకు రూ.21వేల చెక్కులు మంజూరయ్యాయి. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సహకారంతో మంజూరైన ఈ చెక్కులను శుక్రవారం బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సందనబోయిన చంద్రయ్య లబ్ధిదారులకు అందజేశారు. మాజీ ఉప సర్పంచ్ సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, శివారెడ్డి, శేఖర్‌రెడ్డి, సైదులు, అశోక్, బాసిద్, లింగస్వామి, వీరయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

చండూరు, జూన్ 6: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (NMMS)నకు చండూరు హైస్కూల్లో చదువుతున్న విద్యార్థి సంగెపు రాఘవేంద్ర ఎంపిక కావడంపై ఉపాధ్యాయుల బృందం విద్యార్థిని శుక్రవారం అభినందించారు. 8వ తరగతి చదివి, జాతీయస్థాయి పరీక్షలో ఉత్తీర్ణుడై ప్రతి సంవత్సరం 12 వేల రూపాయల స్కాలర్‌షిప్‌ను ఇంటర్మీడియట్ పూర్తి చేసే వరకు ప్రభుత్వం అందిస్తుందని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎడ్ల భిక్షం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్య అందుతుందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదవాలని ఉపాధ్యాయ బృందం కోరింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది మేకలు చోరీ

కొండమల్లేపల్లి, జూన్ 6: మేకల దొడ్డిలో కట్టేసిన పది మేకలను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన ఘటన గుమ్మడవెల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. షరీఫ్ బీ మేకలను మేత కోసం తీసుసుకెళ్లి గురువారం సాయంత్రం ఊరిలోని తన మేకల దొడ్డిలో 50 మేకలు కట్టేసింది. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో రాత్రి గుర్తు తెలియని దుండగులు దొడ్డిలోనుంచి రూ. లక్ష విలువచేసే 8 మేకలు, రెండు పోతులు మొత్తం 10 మేకలు ఎత్తుకెళ్లారని ఆయన తెలిపారు. బాధితురాలు షరీఫ్ బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి దుండుగుల ఆచూకీ కోసం సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు పశువులు, మేకలు, గొర్రెలు చోరీకి గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I SHEELA SRINIVASU, S/o. SATYAMURTHY (Old Name) H.No. 19-142, Reddy Colony, Miryalaguda, Nalgonda District. I have changed my name as SHEELA SRINIVAS, S/o. SATYAMURTHY (New Name).

PLOT FOR SALE
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777625, 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638

'బడిబాట' షురూ

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యం
- జిల్లావ్యాప్తంగా ర్యాలీలు, సమావేశాలు
- రెండు వారాలు కొనసాగనున్న కార్యక్రమం

కట్టంగూర్ ఉన్నత పాఠశాలలో బడిబాటను ప్రారంభిస్తున్న ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు

నెట్‌వర్క్ నమస్తేతెలంగాణ, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం, విద్యాశాఖ చేపట్టిన బడిబాట కార్యక్రమం శుక్రవారం జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమైంది. ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు హాజరై విద్యార్థులతో కలిసి గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు చెప్పారు. విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయంతో పాటు డిజిటల్ తరగతుల ద్వారా ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధన జరుగుతున్నట్లు వివరించారు. తల్లిదండ్రులు 3నుంచి 5ఏండ్ల పిల్లలను అంగన్‌వాడీల్లో, 6 నుంచి 14 ఏండ్లలోపు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య పొందాలని సూచించారు. ఈ నెల 19 వరకు బడిబాట కార్యక రమం కొనసాగనున్నది. ఆయా కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు, ప్రముఖులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేములపల్లి మండలం బుగ్గబావిగూడెంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని

పెద్దవూర మండలం వెల్మగూడెంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నిర్లక్ష్యం ఫలితం.. నిండు ప్రాణం బలి..!

- విద్యుదాఘాతంతో ప్రైవేటు కార్మికుడు మృతి
- స్తంభంపై పనిచేస్తుండగానే విద్యుత్ సరఫరా
- ముప్పారం సబ్ స్టేషన్ వద్ద బంధువుల ఆందోళన

కుర్రి శ్రీను(ఫైల్)

నిడమనూరు, జూన్ 6: విద్యుత్ స్తంభంపై ప్రైవేటు విద్యుత్ కార్మికుడు పని చేస్తుండగానే విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన ముప్పారం శివారులో చోటు చేసుకున్నది. వివరాల ప్రకారం... ముప్పారం సబ్ స్టేషన్ పరిధిలోని గుంటుక గూడెం ఫీడర్ 11 కె.వి.విద్యుత్ లూజ్ లైన్ తీగల సవరణలో భాగంగా స్తంభాలు ఏర్పాటు చేసే పనులను శుక్రవారం చేపట్టారు. ఇందులో భాగంగా విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న కార్మికులు పనులు ముగించారు. త్రిపురారం మండలం అంజనపల్లికి చెందిన కుర్రి నందు (20) స్తంభం పనులు చేస్తున్న సమయంలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో స్తంభంపై పని చేస్తున్న నందు ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై స్తంభంపై నుంచి కిందపడి ప్రాణాలు విడిచాడు. అక్కడున్న తోటి కార్మికులు గమనించి కేకలు వేస్తూ వచ్చి చూడగా అప్పటికే చనిపోయాడు. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులకు సమాచారమందించడంతో అక్కడికి చేరుకున్న మృతుడి తల్లిదండ్రులు శ్రీను, పార్వతమ్మ, వారి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని సబ్ స్టేషన్‌కు తరలించి ఆందోళన చేశారు. నందు మృతికి లైన్‌మెన్ పాపయ్య కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

లైన్‌మెన్ నిర్లక్ష్యమే.. కారణమా..?

స్తంభంపై పనులు చేస్తున్న సమయంలోనే లైన్‌మెన్ పాపయ్య విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ఆదేశించినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. అక్కడే పని చేస్తున్న పలువురు కార్మికులు స్తంభాలు దిగడంతో నందు కూడా దిగినట్లు భావించి ఫోన్‌లో మాట్లాడుతున్న లైన్‌మెన్ ఏమరుపాటుతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ఆదేశించినట్లు సమాచారం. నందు కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది, కాంట్రాక్టర్ సతీష్, అధికారులు మృతుడి బంధువులతో చర్చలు జరిపారు. హాలియా సీ.ఐ.జనార్దన్ గౌడ్, ఎస్.ఐ.సురేష్ ఘటనా స్థలిని సందర్శించారు. ఈ విషయమై ఏఈ శరత్‌ను వివరణ కోరగా విద్యుత్ స్తంభాల పనుల్లో భాగంగా ప్రమాదవశాత్తు విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిపాడు.

ఆహారభద్రతా ప్రమాణాలు పాటించాలి

మున్సిపల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న

చౌటుప్పల్, జూన్ 6: ఆహారభద్రతా ప్రమాణాలు పాటించని వ్యాపారులపై చర్యలు తప్పవని మున్సిపల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో హోటల్స్, రెస్టారెంట్, బేకరీస్, ఫాస్ట్‌ఫుడ్, స్వీట్‌హౌస్, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులతో ఆహార నాణ్యతాప్రమాణాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వ్యాపారస్తుడూ మున్సిపల్ నుంచి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నాణ్యతాప్రమాణాలు పాటించని వారిపై జరిమానా వేస్తామన్నారు. అంతకు ముందు మున్సిపల్‌పరిధిలోని 4వ వార్డులో తడి,పొడి చెత్త హోమ్ కంపోస్ట్‌పై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పరిశీలించిన కలెక్టర్

జూనూతులలో ఇందిరమ్మ ఇల్లును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుర్రంపోడ్,జూన్6: మండలంలోని జూనూతుల గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం విధించిన నియమనిబంధనలకు లోబడే ఇండ్ల నిర్మాణం జరగాలన్నారు. నిర్మాణాల ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకుంటే పూర్తి డబ్బులు వస్తాయని అన్నారు. మండలంలో ఆదర్శ గ్రామంగా ఎంపికైన జూనూతుల గ్రామంలో మొదటి విడతలో 30 మందికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారు. అందులో 23 మంది లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం మొదలుపెట్టారని, అందులో 12 మందికి వారి అకౌంట్లల్లో డబ్బులు జమ అయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఆమె వెంట ఆర్డీఓ రమణారెడ్డి, ఎంపీడీఓ మంజుల తదితరులు ఉన్నారు.

వేడుకలకు ముస్తాబైన మునుగోడు రోడ్డులోని ఈద్గా

త్యాగానికి ప్రతీక 'బక్రీద్'

నేడు భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకోనున్న ముస్లింలు

రామగిరి, జూన్ 6: ముస్లింలు శనివారం బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. త్యాగానికి ప్రతీకగా ఈ పర్వదినాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. ఈరోజున ప్రతి ముస్లిం ఖుర్బానీ ఇవ్వటానికి ఆరాటపడుతుంటాడు. ఇందుకు పొట్టేళ్లు, గొర్రెలు, మేకలను ఖరీదు చేస్తారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈ బక్రీద్ కోసం పట్టణాలతో పాటు వివిధ ప్రాంతాల్లోనుంచి గొర్రెలు, మేకలు, పశువులను ప్రధాన ప్రాంతాలకు అమ్మకానికి తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. ప్రతి సంవత్సరం నల్లగొండ పట్టణంలోని ఇక్బాల్ మినార్, ఆర్పీ రోడ్డు, దేవరకొండ రోడ్డు, ప్రకాశం బజార్ తదితర ప్రాంతాలకు వ్యాపారులు గొర్రెలు తీసుకొచ్చి విక్రయిస్తుండటంతో ఆప్రాంతాలు బక్రీద్ ముందు రోజులు కొనుగోలుదారులతో సందడిగా కనిపిస్తాయి. బక్రీద్ రోజున నమాజ్ కోసం జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డులోని ఈద్గాతోపాటు జిల్లా వ్యాప్తంగా ఈద్గాలను ముస్తాబు చేసి అన్ని వసతులు కల్పించారు.

కొండెక్కిన పొట్టేళ్ల ధరలు..

గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పొట్టేళ్లు, గొర్రెలు, మేకల ధరలు అధికంగా పెరిగాయి. గతంలో 4వేలు ఉన్న ధర ఇప్పుడు 6నుంచి 7వేల వరకు పెంచారు. బరువును బట్టి ధరల్లో తేడాలు ఉన్నాయి. ప్రత్యేకత ఉన్న పొట్టేళ్లకు, గొర్రెలు, మేకలకు 12వేలనుంచి 20వేల వరకు ధరలు పెంచి అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం. వీటి ధర పండుగ రోజున ఇంకా పెంచే అవకాశం ఉన్నదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రథమ స్థానంలో నిలిచిన వరంగల్ బాలుర జట్టుకు బహుమతులు ప్రదానం చేస్తున్న జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి నర్సిరెడ్డి

ముగిసిన హ్యాండ్‌బాల్ పోటీలు

నకిరేకల్, జూన్ 6: మండలంలోని మంగళపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. బాలుర విభాగంలో ఫైనల్స్‌కు చేరిన కరీంనగర్, వరంగల్ జిల్లా జట్లు తలపడగా కరీంనగర్ జట్టు వరంగల్ జిల్లా జట్టుపై గెలుపొంది ప్రథమ స్థానంలో నిలిచింది. వరంగల్ జట్టు ద్వితీయ స్థానాన్ని పొందింది. జిల్లా జట్టు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నది. బాలికల విభాగంలో వరంగల్ జట్టు ఖమ్మం జట్టుపై విజయం సాధించి ప్రథమ స్థానాన్ని పొందింది. ఖమ్మం జిల్లా జట్టు ద్వితీయ స్థానాన్ని, రంగారెడ్డి జిల్లా జట్టు తృతీయ స్థానాన్ని పొందిందని ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉస్మాన్, పుల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి నర్సిరెడ్డి, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరారెడ్డి, సీఐ రాజశేఖర్, ఎస్సై లచ్చిరెడ్డి, కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సీఈవో గోనారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

దేవరకొండలో ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సినీ నటుడు మంచు విష్ణు

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలి

సినీ నటుడు మంచు విష్ణు

చందంపేట(దేవరకొండ), జూన్ 6: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని హీరో మంచు విష్ణు అన్నారు. శుక్రవారం పట్టణంలో క్రైస్తవ జన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను ఆయన హీరో శివబాలాజీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ఉచిత అంబులెన్స్ ఏర్పాటు అభినందనీయమని అన్నారు. అంతకు ముందు దేవరకొండ బస్టాండు వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహ, సర్వయ్య, శ్రీశైలంయాదవ్, మకట్‌లాల్, ఇలియాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

అంబులెన్స్ ఏర్పాటు అభినందనీయం

ఉచిత అంబులెన్స్ ఏర్పాటు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్రైస్తవ జన సమితి ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉచిత అంబులెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉచిత అంబులెన్స్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీజేఎస్ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, కార్యదర్శి రేవ, క్రిస్టోఫర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్, రవీందర్‌నాయక్, శంకర్‌నాయక్, లోక్యానాయక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే సహకార బ్యాంకు లక్ష్యం

జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 6: రైతుల అభ్యున్నతే లక్ష్యంగా సహకార బ్యాంకు సేవలు అందిస్తున్నదని జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలు తీర్మానం చేసి మాట్లాడారు. రైతుల అభివృద్ధికి ఎల్లవేళలా బ్యాంకు సహాయపడుతుందన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి క్రాప్ వైజ్‌గా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆమోదించినట్లు చెప్పారు. డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, గొంగిడి మహేందర్‌రెడ్డి, పాలకమండలి, సీఈవో శంకర్‌రావు పాల్గొన్నారు .

రెవెన్యూ సదస్సు సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి

నార్కట్‌పల్లి జూన్ 6: రెవెన్యూ సదస్సును ప్రతిరైతూ సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ ఆర్డీవో అశోక్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఔరవాణి, నెమ్మాని గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఔరవాణి గ్రామంలో 84 దరఖాస్తులు, నెమ్మానిలో 33 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా వచ్చిన ఫిర్యాదులు అందిన తర్వాత గ్రామాల్లో విచారణ చేపట్టి, భూ సమస్య పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, నాయబ్ తహసీల్దార్ ఆర్ రామకృష్ణ, ఆర్ఐ తరుణ్, అదనపు ఆర్ఐ ఏ భవాని, సర్వేయర్ శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు

సద్వినియోగం చేసుకోవాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య

చౌటుప్పల్, జూన్ 6: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలో పలువురు లబ్ధిదారులకు ఆయన కళ్యాణలక్ష్మీ, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, అంజయ్యగౌడ్, ఇంద్రసేనారెడ్డి, దేవేందర్, నర్సింహ్మాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎస్సీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పవిత్రవాణి

రామగిరి, జూన్ 6 : నల్లగొండలోని చర్లపల్లిలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురకుల డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాజపవిత్ర వాణి కర్ష తెలిపారు. బీఏ హెచ్‌ఈపీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ అనలిటిక్స్, బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, ఎంఎస్‌డీఎస్, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ గ్రూపులో సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 23లోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. పూర్తి వివరాలకు 9000229058 , 8639109606 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

హాలియా, జూన్ 6: అనుముల మండలం హాలియాలోని విత్తనాలు సరఫరా చేసే డీలర్ల దుకాణాలను టాస్క్‌ఫోర్స్ అధికారి శ్రీలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు దుకాణాల్లో విత్తనాల నిల్వ, రిజిస్టర్, బిల్‌బుక్స్, ఇన్‌వాయిస్, కంపెనీ సెక్యూర్ ఆఫ్ సప్లయ్ సర్టిఫికెట్, లైసెన్స్, స్టాక్‌బోర్డు, ధరల పట్టిక మొదలైన వాటిని తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని డీలర్లకు సూచించారు. విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలని లేనిచో విత్తన యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి సరిత ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

పెద్దవూర, జూన్ 6: విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందిన ఘటన మండలంలోని బట్టుగూడెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం బట్టుగూడెం గ్రామానికి చెందిన చెన్ను సైదిరెడ్డికి చెందిన ఎద్దు, ఆవులు మేతకోసం గ్రామ శివారుకు వెళ్లాయి. అందులోని ఒక ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తుండగా విద్యుత్ వైర్ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.